www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 ఏప్రిల్ 2023



పాఠశాలలో ఆర్‌జెడి తనిఖీ

ప్రజాశక్తి -పొదలకూరు

పంచాయతీ పరిధిలోని లింగంపల్లి ఎస్‌సి స్కూల్లో గుంటూరు విద్యాశాఖ ఆర్‌జెసి వి. సుబ్బారావు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పలు రిజిస్టర్లు, చైల్డ్ ఇన్ఫో, వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజన రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్ బాబు వున్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌జెడి

రాజకీయ కుటుంబ కుంపట్లు..!

ఒకప్పుడు వారిది ఒకటే మాట...ఒకటే బాట... ఏ రాజకీయం చేయాలన్న కలిసి కూర్చొని నడిపించేవారు. కుటుంబ పెద్దలకు రాజకీయంగా మంచి స్థానం ఇవ్వాలనే ఉద్దేశంతో దేనికైనా ముందు నిలబడి పనిచేసేవారు. ఇప్పుడు ఆ కుటుంబాల్లో రాజకీయ సుడిగుండాలు తిరుగుతున్నాయి. అన్న లేదు.. తమ్ముడు లేదు.. బాబాయ్ లేదు..ఒకరి పతనానికి మరొకరు సిద్ధపడుతున్నారు. రాజకీయంగా దశాబ్దాల చరిత్ర ఉ్న ఆనం, మేకపాటి, కుటుంబాలు ఇప్పుడిప్పుడే ఎదుగుతోన్న పోలుబోయిన కుటుంబాల్లో రసవత్తర రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి..

◆వైసిపిలో రక్తసంబంధికుల సవాళ్లు
◆ఆనం, మేకపాటి, పోలుబోయిన కుటుంబాల్లో అలజడి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

సింహపురి రాజకీయ చరిత్రలో వారిది ప్రత్యేక స్థానం 80 సంవత్సరాల రాజకీయ చరిత్ర కలిగిన ఆనం కుటుంబానికి జిల్లాలో ప్రత్యేక స్థానముంది. ఏసి సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డి, ఆనం భక్తవత్సలరెడ్డి, నుంచి ఆనం వివేకానందరెడ్డి, ఇప్పుడు ఆనం రామ నారాయణరెడ్డి వరకు ఒకే మాటగా ఉండేవారు. ఇటీవల కాలంలో ఆనం వివేకానందరెడ్డి, రామరాయణరెడ్డి, జయకుమార్, విజయ కుమార్‌కలిసి ఉన్నారు. ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లాలన్నా అందరిది ఒకటే మాట . ఎవరిపై ఎవరు చిన్న మాట అనుకునేవారు కాదు. ఇటీవల మారిన రాజకీయ పరిస్థితుల్లో ఆనం కుటుంబం రాజకీయంగా చిన్నాభిన్నమైంది. ముగ్గురు వైసిపిలో ఉండగా, జయకుమార్‌రెడ్డి టిడిపిలో ఉన్నారు. ఇటీవల ఆనం రామనారాయణరెడ్డి వైసిపి నుంచి బయటకు రావడంతో ఆయన సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి అన్నపై అగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా ఆయనను విమర్శలకు గురిచేశారు.తాను వైసిపిలోనే ఉంటానని స్పష్టం చేశారు. అంతే కాకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడంతో ఇద్దరి మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. అనేక మార్పులు రావడంతో ఆనం రామానారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆ కుటుంబంలో ఎవరు ఎటు ఉన్నారో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబ బంధాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. రామనారా యణరెడ్డి టిడిపిలో చేరితే ఇవి మరింత తీవ్ర మయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మేకపాటి రాజ మోహన్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా 40 సంవత్సరాల చరిత్రే ఉంది. మేకపాటి రాజ మోహన్‌రెడ్డి రాజకీయ జీవితం కోసం ఆయన సోదరుడు ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి

ఆనం రామనారాయణరెడ్డి

ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి

మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

పి అనిల్‌కుమార్ యాదవ్

పి రూప్‌కుమార్ యాదవ్

చంద్రశేఖర్‌రెడ్డి గట్టిగా పనిచేశారని చెబుతారు. ఇద్దరు ఒకే మాట, ఒకే బాటగా నడిచారు. కొద్ది రోజులుగా వారి మధ్య మంచి సంబంధాలు లేవని అందరూ చెబుతుంటారు. చంద్రశేఖర్‌రెడ్డి వ్యక్తిగత జీవితం సరిగాలేదని అందుకే కుటుంబ దూరంగా ఉంటుందని చెబుతుంటారు. ఇటీవల వైసిపి చంద్రశేఖర్‌రెడ్డిని సస్పెండ్ చేసిన తరువాత ఉదయ గిరిలో కొందరు వ్యక్తులు ఆయనపై దాడులకు దిగారు. కుటుంబం వైపు నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. శుక్రవారం నెల్లూరు వచ్చిన ఆయన సోదరులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి మీడియా ముందుకువచ్చి మాట్లాడడంతో వారి మధ్య ఉన్న విభేదాలు ఒక్కసారి తెరపైకొచ్చాయి. సోదరుడి ప్రవర్తన బాగాలేదని, పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేశారని, వచ్చే ఎన్నికల్లో రచనాకు మద్దతు ప్రకటిస్తాని చెప్పడం, అంతకు ముందు చంద్రశేఖర్‌రెడ్డి తన సోదరుడిని ఉద్దేశించి మా అన్న వల్లే నా పరిస్థితి ఇలా అయిందని చెప్పుకొచ్చారు. వీరి మధ్య ఉన్న విభేదాలు ప్రజల్లో చర్చకు ఉండగా ఇప్పుడు మీడియా ముందుకు రావ డంతో బహిర్గతమ య్యాయి. ఇక వీరి మధ్య సఖ్యత కనిపించే పరిస్థితులు లేవు. ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతోన్న పోలు బోయిన వారి కుటుంబం లోను రాజకీయ సునామీ కొన సాగుతోంది. గత ఎన్నికల్లో బాబాయ్ రూప్‌కుమార్ యాదవ్, అబ్బాయి అనిల్‌కు మార్ యాదవ్ ఒకటిగా తిరిగారు. ఒకరి విజయం కోసం మరొకరు బలపం కట్టుకు తిరిగారు. ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. అవినీతి, అక్రమాలకు బయట పెట్టుకుంటున్నారు. రూప్‌కుమార్ నగరంలో మరో కార్యాలయం ప్రారంభించారు. అధిష్టానానికి తెలిసినా మౌనంగా ఉంది. వచ్చే ఎన్నికల్లో రాజకీయ పరిస్థితులు ఓట మికి కారణం కాగలమని చెబుతున్నారు. వైసిపిలో ఉన్న మూడు రాజకీయ కుటుంబాల్లో ఇప్పుడు రాజకీయ సుడిగుండాలు ఉన్నాయి. ఇవి ఏలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి. రాజకీయాల విషయం పక్కనపెట్టినా కుటుంబ బంధాలు చెదిరిపోయాయని తెలుస్తోంది. ఏం జరుగుతుందో చూడాలి..

నెల్లూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న వందేభారత్ రైలు

'వందేభారత్' పరుగులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కేంద్ర రైల్వేశాఖ సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్‌లో ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ జిల్లాలో పరుగులు పెట్టింది. ఎనిమిది బోగీలు కలిగిన వందేభారత్ రైలు ప్రతిరోజూ ఉదయం 6గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి 12.59గంటలకు నెల్లూరు చేరుకుంటుంది. మధ్యాహ్నం రెండు గంటలకు తిరుపతి చేరుకొని మళ్లీ 2.30గంటలకు తిరుపతిలో బయల్దేరి 6గంటల వ్యవధిలో హైదరాబాద్ చేరుకుంటుంది. శనివారం జిల్లాకు వచ్చిన వందేభారత్ రైలుకు వైసిపి, టిడిపి, పార్టీ నేతలతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కావలి, బిట్రగుంట, నెల్లూరు, గూడూరు, కాళహస్తి మీదుగా తిరుపతి చేరుకుంది. జాతీయతను ప్రభోదిస్తూ జాతీయ పతాకాలు చేబూని అన్ని స్టేషన్లు ఘనస్వాగతం పలికారు. విద్యార్థులతో రైలు కిక్కిరిసి పోయింది. మొత్తం 8బోగీలు ఉండగా 6బోగీలు ఏసి చైర్‌కారు, రెండు బోగీలు ఎగ్జిక్యూటీవ్‌లు ఉన్నాయి. ప్రతి స్టేషన్‌లోనూ ఒక్క నిముషం మాత్రమే ఆగుతుంది.రైలు రాక సందర్భంగా రైల్వే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కావలి, బిట్రగుంటలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, నెల్లూరులో ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, తదితర నేతలు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

ఎస్‌పి విజయరావు బదిలీ
నూతన ఎస్‌పిగా తిరుమలేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు :ఎస్‌పి సిహెచ్ విజయరావును గ్రేహౌండ్స్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో కె.తిరుమలేశ్వర్‌రెడ్డిని ఎస్‌పిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాకు ఎస్‌పిగా బదిలీపై వస్తున్న తిరు మలేశ్వరరెడ్డి గతంలో రూరల్ డిఎస్‌పిగా పనిచేసిన అనుభవం ఉంది. జిల్లాకు సూప రిచితులే కావడంతో జిల్లాకు చెందిన రాజకీయ నాయకులతో మంచి సంబందాలే ఉన్నాయి.

ముగ్గురు ఉన్నతాధికారులు బదిలీ..!
ఇదే ఎన్నికల టీమా ?

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి భారీగా ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను బదిలీ చేసింది. తొలి రాష్ట్ర వ్యాపింగా 576 మంది సీనియర్ ఐఎఎస్‌లను బదిలీ చేశారు. ఇందులో కలెక్టర్ చక్రధర్ బాబును విజయ వాడలోని ఎండి ఎలక్ట్రిసిటి బోర్డుకు బదిలీ చేశారు. సుదీర్ఘకాలం కలెక్టర్‌గా చేశారు. సెక్రటరియేట్‌కు వెళతారని అందరూ భావిం చారు. ఆయన గతంలో పనిచేసి చోటుకే పంపారు. చిత్తూరు కలెక్టర్‌గా పనిచేస్తున్న హరినారా యణను నెల్లూరు కలెక్టర్‌గా బదిలీ చేశారు. శుక్రవారం రాత్రి ఎస్‌పి విజయ రావును కాకినాడ బెటాలియన్ కంమాండర్‌గా బదిలీ చేశారు. గతంలో నెల్లూరు రూరల్ డిఎస్‌పిగా పనిచేసిన టి.తిరుమలేశ్వరరెడ్డిని జిల్లా ఎస్‌పిగా పంపారు. ఆయన జిల్లాకు అల్లుడు. ప్రముఖ వైసిపి నేత గురవారెడ్డి కుమార్తెను వివాహం చేసుకున్నారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ డి.హరితను తిరుపతి కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమె కమి షనర్‌గా వచ్చి కేవలం 8 నెలలు మాత్రమే. గతంలో నెల్లూరు ఆర్‌డిఒ, డ్వామా పీడీగా పని చేశారు. ఐఎఎస్ వచ్చిన తరువాత కమిషనర్‌గా ఇక్కడకు వచ్చారు. ఆమె స్థానంలో యువ అధికారి వికాస్ మర్మత్‌ను ప్రభుత్వం నియమి ంచింది. ఒకేసారి ముగ్గురు ఉన్నతాధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ టీమ్ వచ్చే సాధారణ ఎన్నికల వరకు ఉంటుందని తెలుస్తోంది.

హరినారాయణ నూతన , కలెక్టర్

తిరుమలేశ్వరరెడ్డి, నూతన ఎస్‌పి

వికాస్ మర్మత్, కమిషనర్

వ్యవసాయ రంగం బలోపేతానికి కృషి : కాకాణి

ప్రజాశక్తి-నెల్లూరు

వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగం బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తుందని రాష్ట్ర వ్యావసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడం ప్రస్తుతం సర్వసాధారణమైందన్నారు. కాకపోతే అటువంటి కథనాలు ప్రచురితం అయిన సందర్భంలో వివరణ ఇవ్వాల్సిన కనీస బాధ్యత ఆశాఖ మంత్రి అయిన తనపై ఉందన్నారు. ఓ పత్రికలో 'సాగు తగ్గితే.. వృద్ధి పెరుగుతుందా..' అంటూ ప్రచురితం అయిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. కనీస విషయ పరిజ్ఞానం లేకుండా ఇటువంటి కథనాలు రాయడం సరికాదన్నారు. వృద్ధి రేటు పెరుగుదల.. వృద్ధి రేటు తరుగుదల సాగు విస్తీర్ణంపై ఆధారపడి ఉండవన్నారు. సాగు విస్తీర్ణంతోపాటు పలు కారణాలుంటాయని, వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలైన మత్స్య సంపద,పశు గణాభివృద్ధి,అటవీ,ఉద్యానవన తదితర రంగాలపై ఆదాయం వస్తుందన్నారు. కేవలం వరి పంట మాత్రమే కాదన్నారు. వ్యవసాయం అంటే వ్యవసాయ, వాణిజ్య, ఉద్యాన,మత్స్య సంపద,పశు గణాభివృద్ధి తదితర రంగాలలో వచ్చే ఆదాయాన్ని కలుపుకొని వ్యవసాయ వృద్ధి రేటు కింద పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో టిడిపికి పాజిటివ్ ఓటు ఎక్కడ ఉందో చెప్పాలని ప్రశ్నించారు. టిడిపి నాయకులు కొంత మంది మీడియాను, పత్రికలను అడ్డుపెట్టుకొని వారితో వైసిపి ప్రభుత్వంపై నెగటివ్ పబ్లిసిటీ మీద ఆధారపడి రాజకీయ జీవితం గడుపుతున్నారన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పరీక్ష కేంద్రాలలో సబ్ కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు సబ్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికా పట్టణంలోని 10వ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. గాయత్రీ డిగ్రీ కళాశాల, శివ సాయి పబ్లిక్ స్కూల్, చైతన్య హైస్కూల్, విజ్ఞాన్ విహార హైస్కూల్, టిఆర్ఆర్ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట కందుకూరు తహశీల్దార్ డి సీతారామయ్య ఉన్నారు.

ప్రజాశక్తి-నెల్లూరు : పది పరీక్షలకు 442 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి గంగాభవాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27272 మంది పది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 26830 మంది మాత్రమే పరీక్షలు రాశారన్నారు. ఈ పరీక్షల్లో ఎటువంటి అవకతవకలకు చోటివ్వకుండా పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిన ఫ్లైయింగ్ స్వాడ్ బృందాలు 56 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. జిల్లాలోని 6 పరీక్షా కేంద్రాలను డిఈఓ తనిఖీ చేయగా, ఆర్‌జెడిఎస్ఈ 5 కేంద్రాలను, డిఆర్ఓ 6కేంద్రాలను, ఆర్‌డిఒ 4 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారన్నారు.

తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

పులివర్తి నాని నివాసంలో టిడిపి నేతలు

'యువగళం' పాదయాత్రకు టిడిపి నేతలు

ప్రజాశక్తి -కందుకూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులను, నాయకులను తన నివాసానికి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పులివర్తి నాని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ ఉన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు :ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుద్దాం.. వారి కళ్ళల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో పేదల ఆకలిని తీర్చే దిశగా కందుకూరు శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా దేసు సత్యన్నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు సహకారంతో పట్టణ వీధుల్లో ఉండే పేదలకు ఆహారం పంపిణీ చేశారు. శ్రీ రామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, గోనుగుంట చంద్రం పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి -గుడ్లూరు : మండలంలోని తూర్పు గ్రామంలో ఎస్‌సి కాలనీకి సమీపంలో ఉన్న చింతకుంట చెరువులో ప్రమాదవశాత్తు షేక్ మహమ్మద్ (22) అనే యువకుడు ప్రమాదవశాత్తు చెరువు కుంటలో జారిపడి మతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. కావులకు చెందిన షేక్ మహమ్మద్ అమ్మమ్మ తాతయ్య గ్రామం కావడంతో వచ్చి ఇక్కడే ఉంటున్నాడు రాత్రి భోజనం చేసినా అనంతరం తన స్నేహితులతో కలిసి షికారుగా కుంట సమీపానికి పోయి అక్కడ ప్రమాదవశాత్తు జారి పడటంతో తెల్లవారి కొందరు గ్రామస్తులు చెరువులో తేడా ఆడుతున్న యువకులు శవం చూసి సమాచారం పంపడంతో యువకుడుని తాత అమ్మమ్మ మరి కొంతమంది గ్రామస్తులు వెలుగు తీసి పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



యువకుడి మృతదేహం

వామపక్షాల ప్రచార యాత్రను జయప్రదం చేయండి..!
సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజాశక్తి -కందుకూరు

బిజెపి హటావో దేశ్‌కి బచావో నినాదంతో ఈఅనెల 14 నుంచి 30వ తేదీ వరకు జరిగే వామ పక్షాల ప్రచార యాత్రను జయప్రదం చేయలని సిపిఐ, సిపిఎం పిలుపునిచింది. శనివారం కందుకూరు కోటారెడ్డిభవన్లో సమావేశమైన సిపిఐ, సిపిఎం నాయకులు బి సురేష్ బాబు, ఎస్‌ఎ గౌస్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం నియంతత్వ విధానాలతో దేశంలో ఉన్న బిజెపి యేతర ప్రభుత్వాలపై ఉక్కు పాదం మోపుతూ గవర్నర్ల చే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కదలకుండా అనేక ఇబ్బందులు కలిగిస్తూ ప్రభుత్వాలు సాఫీగా నడవడంలో సహకరించకుండా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని వమరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు అమ్మ చూపుతోందని, అలాగే దేశంలోనే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, ఆదాని లాంటి వారికి ఉపయోగపడే విధంగా సముద్ర తీర ప్రాంతాలు పోర్టులు బొగ్గు గనులు ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేస్తోందని విమర్శించారు. సిపిఐ నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు పి మాలకొండయ్య మాట్లాడారు. సిపిఎం నాయకులు టి వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

'నారాయణ'లో ఉచిత కంటి పరీక్షల ప్యాకేజీ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణ వైద్యశాలలో సీనియర్ సిటిజన్స్‌కు ఉచిత కంటి పరీక్షల ప్యాకేజీ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి చూపు నెమ్మదిగా తగ్గుతుందని, చూపు బాగున్నంత కాలం కళ్ల బాగానే ఉన్నాయని అందరూ బావిస్తారన్నారు. అయితే లోలోపల ఎవ్వరూ ఊహించని విధంగా నష్టం జరిగి దృష్టిని కోల్పోతామన్నారు. ఈ ప్రక్రియ నాలుగు దశలలో జరుగుతుందని, వయస్సు పెరుగుతున్న కొద్ది ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం నారాయణ హాస్పిటల్లో "సీనియర్ సిటిజన్స్ ఉచిత కంటి పరీక్షల ప్యాకేజి" అందుబాటులోకి తీసు కొస్తున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీ నందు విజన్, రిఫ్రాక్షన్, కంటి ఒత్తిడి పరీక్ష, కంటి శుక్లముల పరీక్ష, ప్రత్యేక డయాబెటిక్ రెటినోపతి పరీక్ష, గ్లకోమా నిర్ధారణ, బీ.పి, బ్లడ్ షుగర్ పరీక్షలతోపాటు ఫిజీషియన్, ఆప్తాల్మోలజిస్ట కన్సల్టేషన్ కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశం ఏప్రిల్ 7వ తేది నుండి మే 6వ తేదీ వరకు నెలరోజుల పాటు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీ సేవలు పొందాలనుకున్న వారు తమ ఆధార్‌కార్డును విధిగా వెంటతెచ్చుకోవాలన్నారు .వివరాలకు 7331170063 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. .ఈ సమావేశంలో నారాయణ హాస్పిటల్ కంటి వైద్య నిపుణులు డావ కుమార్ అమత్, డావ రమ్యదీప్తి, డావ మాధురి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలో పిటిపి, అంగన్‌వాడీ, ఆశా, ఆటో, హమాలి, రోడ్డు మార్జిన్, బిల్డింగ్ తదితర రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న రోజువారి సమస్యలపై వారిని అంటిపెట్టుకొని నిత్యం పోరాటాలు చేయటం ద్వారా కార్మికుల విశ్వాసాన్ని పొందాలని సిఐటియు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్ కుమార్ పేర్కొన్నారు. సిఐటియు ఉలవపాడు మండల కమిటీ శనివారం మీర్ మెమోరియల్ స్కూల్లో జరిగింది. ఈ సమావేశానికి వాకా లతారెడ్డి అధ్యక్షత వహించింది. సిఐటియు ఉలవపాడు మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలు రాసే విధంగా చట్టాలను తీసుకొచ్చాని విమర్శించారు. సిఐటియు జిల్లా నాయకులు జీవీబీకుమార్ మాట్లాడుతూ పిటిపి కార్మి కులకు మెరుగైన వేతన ఒప్పందం చేయాలని కోరారు. అంగన్‌వాడీలు, ఆశాలపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.మండల కార్యదర్శి ఎస్‌డి గౌస్ భాషా కార్యకలాపాల నివేదిక ఇచ్చారు. మండల కమిటీ సభ్యులు, వివిధ రంగాల బాధ్యులు చిమటా శ్రీను వాసులు, సిహెచ్ ఇందిరావతి, గంజి శ్రీనివాసులు, ఎస్‌డి జహీర్, కత్తి బుజ్జమ్మ, ఎం జయ, డి కోటేశ్వరరావు, సుల్తాన్, ఆంటోని, భవాని, తిరుపతమ్మ కోటేశ్వరి, గీత, ప్రవీణ ఉన్నారు.

ప్రజాశక్తి -గుడ్లూరు : ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుడ్లూరు మండలం సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం శనివారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో కొట్టే వెంకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి కఠారి అజయ్ కుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రవాణా రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఆటో వర్కర్సు పెద్ద ఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. రామాయ పట్నం పోర్టు పనులు త్వరగా పూర్తి చేసి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటోలకు ఏప్రిల్ 1నుండి టోల్ గేట్ వసూలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు జి రాజేష్, బి మాధవ, ఎస్‌కె షరీఫ్, జాషువా, చిట్టి బాబు, దామా కష్ణయ్య, మన్నెం సుబ్రమణ్యం, ఓంకార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కె అజయ్‌కుమార్

'జగనన్న నువ్వే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి -కందుకూరు : పట్టణంలో ముమ్మరంగా సాగుతున్న జగనన్నే మా భవిష్యత్తు నువ్వే కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొంటున్నారని వైసిపి నాయకులు తెలిపారు. పట్టణంలోని 5వవార్డు, 20వ వార్డు, 30వవార్డు, 15వ వార్డులలో ముమ్మరంగా సాగాయి. గృహసారథులు ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు గురించి, ప్రతి గహానికి అందిన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు గురించి ఆరాతీస్తున్నారు. జేసిఎస్ కందుకూరు కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, పట్టణ అద్యక్షుడు షేక్ రఫీ, రాష్ట్ర కార్యదర్శి గణేషంగంగిరెడ్డి,జనార్దన దేవాలయం చైర్మన్ రావులకోల్లు బ్రహ్మానందం, రాష్ట్ర కష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పాశంకొండయ్య కుమారి, సచివాలయం కన్వీనర్లు బల్లేపల్లి మాల్యాద్రి, బక్కమంతుల అశోక్, చనమాల కోటేశ్వరరావు, దేవరకొండ ఆదిలక్ష్మి, చీమకుర్తి కష్ణారెడ్డి, గహసారధులు ఉన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో విజయవంతంగా జరుగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలం ముంగలదొరువు, చింతోపు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామాల అభివద్ధే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగుతోందన్నారు.ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించాచరు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పిటిసి శేషమ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, వెరిచెర్ల శ్రీనివాసులు గౌడ్, ఆకుల మధు, ఎంబేటీ సంధ్యరాణి ఉన్నారు.

'మాలకొండ'లో కలెక్టర్

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం శనివారం భక్తులతో దర్శనమిచ్చింది. వేసవి ప్రారంభం కావడంతో పాటు విద్యార్థులకు పరీక్షలు పూర్తవడంతో కుటుంబ సమేతంగా వచ్చేవారి సంఖ్య పెరిగింది. కలెక్టర్ చక్రధర్‌బాబు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారితో పాటు కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తుల నుంచి వివిధ రూపాల్లో రూ. 10,48,765 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

మాలకొండను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి -వెంకటాచలం

మండంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండల టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎన్ వెంకటాద్రి విమర్శించారు. వెంకటాచలం మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న రవీంద్ర భారతి స్కూల్ వద్ద పదో తరగతి విద్యార్థులు ఎండలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.. పరీక్ష కేంద్రానికి కిలోమీటర్ దూరంలోనే విద్యార్థులను ఆపుతున్నారన్నారు. ఇప్పటికైనా పరీక్షా కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డాక్టర్ ప్రమీల మాదమాల ఎంబిబిఎస్, ఎమ్‌డి యుఎస్‌ఎ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 125 మందిని పరీక్షించి ఉచితంగా మందులు ఇచ్చారు. ముఖ్యంగా 60 మంది సుగరు, బి.పి., వ్యాధిగ్రస్తులకు మూడు నెలలకు సరిపడా మందులను అందజేశారు. ఈ మందులను ఆలయన్స్ ఫౌండేషన్- ఇండియా వారు సరఫరా చేశారు. ఈ వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్ రెడ్డి నిర్వహించారు. గ్రామ సచివాలయ వైద్య సిబ్బంది షంషాద్ బేగం, మాధురి, కాంతమ్మ, గ్రామ నాయకులు అంబటి రాధాకృష్ణారెడ్డి, షార్ విశ్రాంత ఉద్యోగి అల్లంపాటి ధనుంజయరెడ్డి, కామిరెడ్డి అశోక్, తదితరులు సహకారం అందించారు.

కొత్తపల్లిలో ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలం కొత్తపల్లిలో ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు, హ్యూమన్ రైట్స్, అఫెన్స్ కంట్రోల్ కమిటీ నెల్లూరు జిల్లా చైర్మన్ కాసాగాని వెంకట రమణయ్య ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ ఆఫ్ ఆగ్నేష్ చారిటబుల్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పి.ఎం.పి. అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ కోశాధికారి డాక్టర్ పద్మావతి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలకు ఉచితంగా ట్రైలరింగ్ నేర్పించడం, వృద్ధులకు, వికలాంగులకు చేయూత నివ్వడం, తల్లి తండ్రి లేని పిల్లలకు సహాయం చేయడం, స్త్రీలకు ఉపాధి అవకాశాలు చూపించడం, విద్యార్థులకు విద్య అందించడం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సూరా.వెంకట సుబ్బమ్మ, సర్పంచ్ చిన్న ఓబులమ్మ, వైసిపి నాయకులు చిలకా క్రిష్ణారెడ్డి, సచివాలయ ఎఎన్ఎం శేషమ్మ, ఆశ వాలంటీర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వసతులు కల్పిస్తాం..

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని కంపసముద్రం సచివాలయం పరిధిలోని చాబోలు అంగన్‌వాడీ సెంటర్‌లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ ఎస్.కె.ఖాజామొహిద్దీన్ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ గర్భం ధరించినప్పటి నుండి కాన్పు అయ్యే వరకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు వసతులు కల్పిస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పొందాలని, వ్యాధినిరోధక టీకాలు సకాలంలో వేయించుకోవాలని కోరారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలు తీరును అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ 1 నుండి రెండవ కాన్పులో అమ్మాయిలు పుట్టిన తల్లులకు ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం కింద ఆర్థిక లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రెండవకాన్పులో అమ్మాయిలు పుట్టిన తల్లులు డాక్యుమెంట్లు పి హెచ్ సిలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఎం.భూలక్ష్మి, ఎఎన్ఎం ఎస్.కె.రసూల్ బి, అంగన్‌వాడీ టీచర్ పి.వెంకటలక్ష్మి, ఆయా ఎం.లక్ష్మిదేవి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రెండు పవర్ స్ప్రేయర్లు అందజేత

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో పరిమి శ్రీహరి నల్లదస్నల శ్రీనివాసులు శనివారం రెండు నూతన పవర్ స్ప్రేయర్ కాళ్ళకూరి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు అందజేశారు. గ్రామంలో నిరుపేద రైతులు వారికి అవసరమైనప్పుడు సదరు రైతుల నుండి పవర్ స్ప్రేయర్ తీసుకొని వినియోగించుకోగలరని గ్రామస్తులకు తెలియజేశారు. ఇలానే ఏయే గ్రామాలలో అవసరమైన వారి అభ్యర్థన మేరకు అక్కడ సచివాలయంలో లేదా రైతు భరోసా కేంద్రాలలో, రైతులకు పవర్ స్ప్రేయర్లు అందిస్తున్నట్లు కాళ్ళకూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకర్ల సురేష్ తెలియజేశారు. కార్యక్రమంలో పరిమి శ్రీహరి, నల్లదస్నల శ్రీనివాసులు, మళ్లినేని బాలకృష్ణ, వర్గినేని మునిలయ్య, కరి ఆవుల వేణుగోపాల్, మళ్లినేని హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఐ కుటుంబసభ్యులకు మేకపాటి పరామర్శ

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో హఠాన్మరణం పొందిన ఎం.నాగేశ్వరరావు కుటుంబసభ్యులను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. శనివారం ఆత్మకూరులోని వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన సహాయం గురించి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవసరమొచ్చినా తమ దృష్టికి తీసుకుని రావాలని కుటుంబసభ్యులకు తెలిపారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-కావలి : కావలి జెడ్‌పి గ్రౌండ్‌లో నెల్లూరు జిల్లా లెదర్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా శనివారం ముఖ్య అతిథిగా కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. సరదాగా కాసేపు మ్యాచ్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడా రంగంలో కూడా యువత పార్టిసిపేట్ చేసి, కావలి నియోజకవర్గానికి మంచిపేరు తీసుకురావాలని క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కావలి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఈతముక్కల బాల మురళి రెడ్డి, నాయకులు ప్రసాద్ రెడ్డి, కుందుర్తి కామయ్య, ఆత్మకూరు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : తుఫాన్ నగర్‌లో ఉన్న సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో శనివారం సంస్థ సంరక్షణలో ఉన్న 22మంది పిల్లలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం, పోస్ట్ ఆఫీస్‌లో ప్రతినెల రూ.1000 జమ చేస్తున్న పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ బెజవాడ రవికుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం.ఆజీజ్‌బాబు, విశ్రాంత లెక్చరర్ ఎంవిఎన్ ప్రసాద్ రావు, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొని పిల్లలకు బియ్యం వితరణ చేశారు. పేద పిల్లలను సంరక్షిస్తున్న దాతలు డాక్టర్ బి.రాజేంద్ర ప్రసాద్ –రాధిక, డాక్టర్ పద్మజ కె, ఎమ్.నితిన్ కుమార్ – నిఖిలలు, సామ్ బి సదాస్ –అమద సదాస్‌లు, బెజవాడ.ప్రకాష్–శకుంతలలు, డాక్టర్ బి సతీష్ –డాక్టర్ పి.ఉషారాణి లకు, పాచ్ర వెంకటేశ్వర్లు – ప్రమీలలు, కొత్తసంజనా క్రిష్ణ (డాక్టర్ కొత్త వంశీ కృష్ణ–డాక్టర్ కొత్త అమూల్య రవి కుమార్‌లకుమార్తె), కాసుల్ రమాదేవి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ కె.అనిల్ కుమార్ – డాక్టర్ బి.మాధవి లతలకు, పి.శ్రీ జనిత్ (డాక్టర్ పి. శ్రీధర్ – డాక్టర్ కె.రూప్‌నీ కుమారుడు)కి సంయుక్త సేవా సంస్థ ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రములో మద్రాసఏ మాషఖరియా 28వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ముస్లిం సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మద్రాస విద్యార్థులకు, క్విజ్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పవిత్ర రంజాన్ మాసం విశిష్టత గురించి దర్గాహ్ పీఠాధిపతులు శ్రీ సాని సాహెబ్ కిబ్ల, శ్రీ మజీద్ సాహెబ్ ప్రసంగించారు. కార్యక్రమంలో మద్రాసా విద్యార్థులకు, పేద ప్రజలకు 500 మందికి అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు.

చేతిపంపు ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో రాబోవు వేసవి దృష్ట్యా ఆత్మకూరు మండలంలోని మంచినీటి సమస్య లేకుండా జిల్లా పరిషత్ సాధారణ నిధులు నుండి రూ.1.20 అంచనాలతో అరవీడులి గ్రామంలో మంజూరైన చేతి పంపు ఏర్పాటుకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మకూరు మండల పరిషత్ అధ్యక్షులు కేతా వేణు గోపాల్‌రెడ్డి, రూరల్ వైసిపి నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు, అరవీడు గ్రామ సర్పంచ్ సూరా ప్రసాద్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగిన వెంటనే ఆత్మకూరు మండలంలోని చెర్లోయడవల్లి, అప్పారావుపాలెం, దేపూరు, బోయిల్ చిరివెళ్ల పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో రూ.1.20 అంచనాలతో బోర్లు మంజూరు చేయించిన ఆత్మకూరు జిల్లా పరిషత్ సభ్యురాలు ఆరుణమ్మకు ఆత్మకూరు జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్న లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 20వ వార్డు పరిధిలో ఉన్న పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్ష సమయంలో చల్లని తాగునీటి అందించే ఉద్దేశంతో పాఠశాల ప్రాంగణంలోనూ, బయట చల్లని వాటర్ క్యాన్లను కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి శనివారం ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణం, స్కూల్ బయట రెండు చోట్ల చల్లని మంచినీటి వసతిని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, రాకేష్, తదితరులు హాజరయ్యారు.

10న గంధమహోత్సవం

ప్రజాశక్తి-ఉదయగిరి : శ్రీ హజరత్ సూఫీ మొహమ్మద్ జైనులాబిద్దీన్ ఖాదిరియల్ చిష్తియా అబిద్ బాబా 20వ గంధమహోత్సవం జరుగునున్నట్లు దర్గా కమిటీ పేర్కొన్నారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తేది సోమవారం ఈ గంధ మహోత్సవానికి ముందుగా గోడ పత్రికను విడుదల చేస్తున్నామన్నారు. కుల, మతాలకు అతీతంగా, మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనన్నారు.

ప్రజల సంక్షేమమే జగనన్న లక్ష్యం

ప్రజాశక్తి-కావలి

ఎన్ని అడ్డంకులు ఎదురైనా, కరోనా వంటి విపత్కర పరిస్థితులు చవిచూసినా, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎక్కడా రాజీ పడకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వ హించిన "వైఎస్ఆర్ ఆసరా మూడో విడత" రుణమాఫీ నిధులు పంపిణీ సంబరాల్లో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో కలిసి మంత్రి కాకాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వయం సహాయక మహిళలు వారు ఉపాధి పొందుతున్న పనిముట్లతో ఏర్పాటుచేసిన స్టాళ్లను ప్రజా ప్రతినిధులు పరిశీలించి, వాటి పనితీరు, పొందుతున్న లాభాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రతి పథకాన్ని కూడా మహిళలను భాగస్వామ్యం చేస్తూ ముఖ్య మంత్రి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని చిరు వ్యాపారాల ద్వారా రాణించి ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై తక్కువ వడ్డీకే సహకార బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తుంద న్నారు. మహిళలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేదరికం వల్లఎవరూ ఇబ్బంది పడకూడదన్నారు. ఆ కుటుంబాల కు ఆర్థికంగా భరోసా కల్పిస్తే, వారు ఆర్థిక స్వావలంభన సాధించి సంతోషంగా జీవిస్తారనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, వాహన మిత్ర, ఈబీసీ నేస్తం వంటి అనేక పథకాలను విజయ వంతంగా అమలు చేస్తున్నార న్నారు. ప్రతి పథకాన్ని కూడా ఇంటి వద్దకే నేరుగా డోర్‌డెలివరీ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. రాష్ట్రంలోని మహిళలను సొంత అక్కాచెల్లెళ్లుగా భావిస్తూ పాదయాత్ర లో ఇచ్చిన హామీమేరకు స్వయం సహాయక సభ్యులకు ఆసరా 3వ విడత నిధులను సిఎం విడుదల చేస్తున్నారన్నారు. ఎవరి ప్రమేయం లేకుండా, ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నేరుగా మహిళల ఖాతాల్లోనే ఈ నగదును జమ చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.19 200 కోట్లు ఈ పథకానికి ఖర్చు చేస్తుండగా, మూడో విడతలో జిల్లాలోని 34,440 గ్రూపులకు రూ.826 కోట్లు మంజూరు చేసామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని విభిన్న తరహా జీవనోపాధులు ఎంచుకుని ఆర్థిక సుస్థిరత సాధించాలని మంత్రి మహిళలకు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, కరోనా వంటి పరిస్థితుల్లో ఈ పథకాలు ప్రజలకు భరోసానిచ్చాయన్నారు. కావలిని కనక పట్టణంగా అభివృద్ధి చేసేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని స్పష్టం చేశారు. ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రిని ప్రతిఒక్కరూ మంచి మనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఇచ్చిన మాట కట్టుబడి అని హామీలు అమలు చేశారని, వైయస్సార్ ఆసరా మూడో విడత కింద ఒక కావలి పట్టణానికే సుమారు రూ.8 కోట్లు అక్క చెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారనిత తెలిపారు. తొలుత బాపూజీ విగ్రహానికి పూలమాలు వేసిన ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పొదుపు మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి, కావలికి సంబం ధించిన 1148 సంఘాల్లోని 10529 మంది సభ్యులకు వైఎస్ఆర్ ఆసరా 3వ విడత మొత్తం 8 కోట్ల 67 లక్షల 63 వేల రూపాయల చెక్కును మహిళలకు అందజే శారు. కార్యక్రమంలో మెప్మా పిడి డి.రవీం ద్ర, ఆర్‌డిఒ వి.కె.శీనా నాయక్, ఎఎంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, మెప్మా ఐ.బి.అంకయ్య, బ్యాంకు లింకేజీ. సురేంద్ర, కొండయ్య, ఆర్.పి.సి.ఎం.ఎం. భారతి, మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి కాకాణి, రాజ్యసభసభ్యులు బీద, ఎంఎల్ఎ రామిరెడ్డి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఉజ్వల భవితకు పెట్టుబడి లాంటిదని, ఆయన అందిస్తున్న ఆర్థిక సహకారంతో ప్రతి ఒక్కరూ అభివృద్ధి సాధించాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ ఆసరా సంబరాల్లో భాగంగా పొదుపు మహిళలకు 3వ విడత ఆసరా జమ చేసిన నమూనా చెక్కును ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి అందజేశారు. తొలుత ఎఎస్‌పేటకు వచ్చిన ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అందరిని పేరుపేరున పలకరిస్తూ ఎంఎల్ఎ సభా స్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలను అందచేస్తున్నారన్నారు. తాను 10 నెలలుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ విషయం స్వయంగా తెలుసుకుంటున్నాని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమమని, సంక్షేమ పథకాలను అందచేస్తూనే ప్రజా సమస్యలు తెలుసుకు నేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, పొదుపు మహిళలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

చుక్కల భూముల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న చుక్కలభూములపై సంబంధిత రైతులకు ఎట్టకేలకు రైతుసంఘాల పోరాటాలతో పాదయాత్రలతో చుక్కల భూముల సమస్య కొంతమేర పరిష్కారమైం దని ఎపి రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్కు కృష్ణ ప్రసాద్, కృష్ణమోహన్ అన్నారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 65 వేల ఎకరాల చుక్కల భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను ఇచ్చినట్లు తెలిపారు. సంవత్సరాల తరబడి ఆవేదన చెందుతున్న రైతులకు ఉపశమనం లభించిందన్నారు. సుమారు 2 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నట్లు సమాచారం కానీ కేవలం 65 వేల ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వడం వల్ల ఈ చుక్కల భూముల సమస్య అలానే ఉన్నట్లు తెలుస్తుందన్నారు. అధికారులు వారి వారి పరిధిలో 1బి రికార్డులను సవరణ చేసి ఇంకనూ పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను సేకరించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి ఓపెన్ క్లస్టర్‌కు చెందిన రైతులు 603పొగాకు బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకువచ్చినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వీటిలో 561బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారన్నారు. వివిధ కారణాలతో 38 పొగాకు బేళ్లను తిరస్కరించారని తెలిపారు. అధిక బరువుతో ఉన్న 04పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించా రన్నారు. వీటిలో ఎన్ఎస్ 32ఎన్ బి04సి ఆర్ 02ఉన్నాయని, కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.98 కాగా కనిష్ఠ ధర రూ.50, సగటు ధర రూ.76.26 నమోదుగా ఉందన్నారు.

వందేభారత్ రైలుకు 'బిఎంఆర్' స్వాగతం

ప్రజాశక్తి-బిట్రగుంట

నూతనంగా నడుపుతున్న సికింద్రాబాద్ నుండి తిరుపతి వరకు వందే భారత్ రైలు బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు శనివారం రాత్రి చేరుకోక రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి రైలుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి ప్రారంభించిన రైలును చూసేందుకు బిట్రగుంట, నెల్లూరుకు నిలుపుదల ఇచ్చారని, హైదరాబాదు నుండి తిరుపతికి వెళ్లేందుకు భక్తుల సౌకర్యార్థం ట్రైన్‌ను ముఖ్య స్టేషన్లో మాత్రమే అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, నాయకులు పెంచలయ్య, కీర్తన, మేకల శ్రీను, ఏ కే సుందర్ రాజ్, గండూరి శ్రీను, తోటపల్లి సాగర్, మద్దిబోయిన శేఖర్, పెండ్లి వెంకటేశ్వర్లు, నాయబ్ రసూల్, పాపయ్య, సాల్మన్ రాజ్, నూరుద్దీన్, మెతుకు రాజేశ్వరి, జీవన్‌కుమార్, నూకసాని శ్రీనివాసులు, పసుపులేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తమిళనాడు మత్స్యకారుల దాడి

దాడిలో గాయపడ్డ శివాజీ

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని ఇస్కపల్లి పాలెంకు చెందిన ఎల్లంగారి శివాజీపై శనివారం ఉదయం తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు మత్స్యకారులు దాడి చేయడంతో అతను తీవ్ర గాయాల పాలయ్యాడు. సంబంధిత విషయం తెలుసుకున్న గ్రామస్తులు బాధితుడికి మద్దతుగా నిలిచి మెరైన్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన అనేకమంది అక్రమంగా చొచ్చుకు వస్తూ తమ సంపదను కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీరంలో అల్లకల్లోలం సృష్టిస్తూ తమకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు.

మృతుల కుటుంబాలకు పోలంరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ఇందుకూరుపేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు పట్నం గోపి, లేబూరు వెంకటేశ్వర్లు పలు కారణాల వల్ల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు. శనివారం మృతి చెందిన ఇరువురు కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కొంతసేపు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి బాగోగులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి తామున్నాం అంటూ భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర చౌదరి, టిడిపి నాయకులు, మాదాల రాంప్రసాద్, జొన్నలగడ్డ విష్ణుబాబు తదితరులున్నారు.

రూ.48 కోట్లతో బీచ్ రోడ్డు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

జిల్లాలోనే పేరుగాంచిన టూరిస్ట్ స్పాట్ మైపాడు బీచ్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం రూ.48 కోట్లు మంజూరు చేయడంపై ప్రధాని నరేంద్ర మోడీకి, ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డికి, రక్షణశాఖ సలహాదారులు గుండాలు సతీష్‌రెడ్డికి ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ప్రజలతో మమేకమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.48 కోట్లతో మూడో మైలు నుండి మైపాడుకు రోడ్డు విస్తరణ పనులతో ఇందుకూరుపేట మండలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఈ రోడ్డు మూడో నెల నుండి మైపాడు వరకు 9 గ్రామాల మీదుగా 33 అడుగులు వెడల్పుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నా మన్నారు. పట్టు విడవని విక్రమార్కుడిలా నిధులు మంజూరు కావడానికి ముఖ్యపాత్ర పోషించిన మైపాడు యువనేత దువ్వూరు కళ్యాణ్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించి ప్రశంసల వర్షం గుప్పించారు. ఇందుకూరుపేట మండలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చడానికి ప్రతిపాదనను ఆమోదించిన ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే రవాణా రంగం, ఆక్వా రంగం, రియల్ ఎస్టేట్, పర్యాటక రంగాలలో ఇందుకూరుపేట ఎలనేని ఖ్యాతిని గడిస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, బట్టేపాటి నరేందర్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతానికి కృషి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాలతో 20 రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు లోని మేకపాటి కార్యాలయంలో పట్టణ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడు తూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వారికి కేటాయించిన గృహాలకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిం చాలని సూచించారు. ప్రజా మద్దతు పుస్తకం ద్వారా ప్రజల నుండి గత పాలన కంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షే మం, అభివృద్ధి ఎలా జరిగిందనే వివరాలను పూర్తిగా తెలుసు కోవాలని సూచించారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రస్తుతం జగనన్న పాలనలో వారి కుటుంబాలకు మంచి జరిగిందా లేదా, ప్రతి కుటుంబానికి పింఛన్, అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను నేరుగా అకౌంట్లలో జమ చేయడంపై స్పందన, సంక్షేమ అభివృద్ధి పథకాలను కొనసాగించాలా వద్దా, జగనన్న పాలనలో అమలవుతున్న ఈ సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కూడా కొనసాగించ డానికి నమ్మకం ఉంచి మద్దత ఇస్తారా అనే అంశాలను తప్పకుండా తెలుసు కోవాలన్నారు. 20రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల మద్దతు ఎలా ఉందో తుది నివేదికలను తెలియచేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య ఎస్‌సిసెల్ అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, సయ్యద్ జమీర్, వెండి రమణయ్య తదితరులున్నారు.

ప్రజాశక్తి-జలదంకి : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉదయగిరి పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కావలి మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణు గోపాల్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మేరకు మండలంలోని టెంకవారిపాలెం, అప్పారావు సంఘంలో ఇంటింటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చేవూరు జనార్ధన్ రెడ్డి, జెడ్‌పిటిసి శివలీలమ్మ, జిల్లా ప్రచార జిల్లా అధ్యక్షులు పాలవల్లి మాలకొండ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, సచివాలయ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, ఎంపిటిసి పొట్లూరు వెంకమ్మ, జలదంకి సర్పంచ్ చలంచర్ల అనురాధ, గోసు మధుయాదవ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని నాగసముద్రం గ్రామంలో రొండవరోజు శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి, ఎంపిపి మెట్టుకూరి శిరీష, వైసిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ కీట్లను పంపిణీ చేసి ఇంటింటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నందిపోగు జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రాకుటూరు గ్రామ సచివాలయం పరిధిలో కుమ్మరకొండూరు గ్రామంలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి పాలూరు మాల్యాద్రి రెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో నోటి జనార్దన్ రెడ్డి, కలిగిరి జెసిఎస్ కన్వీనర్ మధు సుధన్‌రెడ్డి, హర్షరెడ్డి, నాగసముద్రం ఉప సర్పంచ్ హాజరత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు వలంటీర్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పడమటి నాయుడుపల్లి సచివాలయ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో శనివారం వైసిపి నాయకులు చిలపంచిన కొండయ్య నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి బుక్‌లెట్, స్టికర్ అందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలతో వారు పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వంవల్ల చేకూరిన లబ్ధిని స్థానిక ప్రజలకు వివరించి, ఇంకేమైనా సమస్యలు ఉన్నాయని ఆరాతీశారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని విధంగా పెద్ద ఎత్తున వివిధ సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్నారని తెలిపారు. వలంటీర్లు నల్లబోతుల కల్యాణి, వెంకట సుబ్బయ్య, గ్రీన్ అంబాసిడర్స్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చి నగరంలో 14 వార్డులో ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు చైర్ పర్సన్ మోర్ల సుప్రజ సూచనలతో కౌన్సిలర్ చీర్ల ప్రసాద్ యాదవ్ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చీర్ల ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలన అందిస్తోం దని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి ఉన్నతాధికారుల బదిలీలు

ప్రజాశక్తి-నెల్లూరు

కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును, ఎస్‌పి సిహెచ్ విజయరావును, నగర పాలక సంస్థ కమిషనర్ హరితలను ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తూ అర్ధరాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ బదిలీలు దేనికి సంకేతమని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఒక్క జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి 56 ఐఎఎస్‌లను గురువారం, 23 మంది ఐపిఎస్‌లకు స్థాన చలనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత జిఒ విడుదల చేయడంలో గల ఆంతర్యమేమిటని, అందరూ అనుకుంటున్న విధంగా ముందస్తుగా ఎన్నికలకు వెళ్లేందుకు అధికార పార్టీ అడుగులు వేస్తుందా అన్న ప్రశ్న ప్రజల మెదడును తొలిచివేస్తున్న ప్రశ్న. ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రుల ఎంఎల్‌సిగా టిడిపి బలపరిచిన గెలుపొందడంతో నగరంలో టిడిపి కార్యకర్తల్లో, నాయకుల్లో ఉత్సాహం పెల్లుభికుతుంది. నగరంలో నిర్వహించిన ఐదు పార్లమెంట్, 35 అసెంబ్లీ స్థానాలకు చెందిన ముఖ్యనేతలతో నగరంలో నిర్వహించిన జోన్–4 సమావేశం విజయవంతం అయిందనే చెప్పుకోవాలి. రూరల్ నియోజకవర్గం ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికార పార్టీ నుంచి దూరమై ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై తనదైన శైలీలో అస్త్రాలు సంధిస్తున్నారు. ఈ క్రమంలో పొట్టేపాళెం ప్రాంతం సమీపంలో కలుజుపై వంతెన నిర్మాణం చేపట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జలదీక్ష పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటిలో కూర్చుని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి అనుమతులు ఇవ్వాలంటూ పోలీసు శాఖను కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వాస్తవానికి ఈ నిరసన కార్యక్రమానికి అనుమతి ఇస్తే రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఎక్కడ ప్రజల మద్దతు ఎక్కడ లభిస్తుందోనన్న ఆలోచనతో పోలీసుల సహాయంతో ఆ నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేశారు. దీంతో ఎంఎల్ఎ తన స్వగృహం వద్దనే బైటాయించి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ప్రభుత్వం ఒక విధంగా ఆలోచన చేసి నిరసన భగ్నం చేస్తే అది కాస్తా రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మేలు చేసిందనే చెప్పుకోవాల్సి వస్తుంది. పోలీసులు జల దీక్ష కార్యక్రమానికి అనుమతులు ఇవ్వకుండా కుంటి సాకులు చెబుతూ భగ్నం చేస్తే దానిని ఖండిస్తూ అన్ని రాజకీయ పార్టీలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన నిరసన కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 172 పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేం దుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నా రు. 27272 మంది విద్యార్థులు పది పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇటీవల కాలంలో నగరంలోని గుర్రాల మడుగు సంఘం వద్ద ఏడాదిన్నర వయస్సు కలిగిన ఓ చిన్నారి రాత్రి సమయంలో నిద్రిస్తుండగా కన్న తల్లే సర్వేపల్లి కాలువలో పడవేసిన దారుణం పలువుర్ని కలిచివేసింది. జిల్లా పోలీసు అధికారులు ఇటీవల ప్రవేశపెట్టిన మొబైల్ హంట్ ద్వారా ప్రజలకు పోగొట్టుకున్న 204 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. నాలుగు కేసులు నమోదు చేయడంతోపాటు సెల్‌ఫోన్లు దొంగతనంతో సంబంధం ఉన్న 7 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ మొట్టమొదటి సారిగా నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ మూడవ ప్లాట్‌ఫారంకు రాత్రి 8 గంటలకు చేరుకుంది. ఈ ట్రైన్‌కు ప్రజలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు.

వీక్షణం

ఖండన ప్రకటన

తే01-04-2023దిన **బి.వి.శేషయ్య,** న్యాయవాది, కందుకూరు ఇచ్చిన బహిరంగ ప్రకటనను ఖండిస్తూ, నాకక్షిదారులైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా (పాత ప్రకాశం జిల్లా) ఉలవపాడు మండలం, ఉలవపాడు గ్రామ కాపురస్తులైన **బాపనపల్లి లక్ష్మీకుమారి** (భర్త లేట్ **సత్యనారాయణ**) మరియు **గార్లపాటి గాయత్రి** (భర్త **శ్రీనివాసరావు**) లు ఇచ్చిన సంజాయిషీ మేరకు సదరు ఉలవపాడు గ్రామమునకు చెందిన **బాపనపల్లి శబరి సాయినాద్** అనునతను మాకక్షిదారుల యొక్క కుటుంబ ఆస్తులను దురుద్దేశ్యంతో చేజిక్కించుకోవాలనే కుట్రతో, అతను మాకక్షిదారుల కుటుంబ సభ్యులయిన **బాపనపల్లి శ్రీమన్నారాయణ, వెంకటసుజాత** గార్ల దత్తు కుమారుని గా ప్రకటించుకుంటూ, **తే25-10-2014ది** న శ్రీసింగ రాయకొండ సబ్ రిజిస్ట్రారు గారి ఆఫీసు లో **డాక్యుమెంట్ నెం. D.IV/14/2014**. అను డాక్యుమెంటును ఫోర్జరీ ద్వారా సృష్టించుకొనియున్నాడు. ఆ తేది నుండి సదరు బాపనపల్లి శ్రీమన్నారాయణ మరియు **వెంకటసుజాత** గారలు, **బాపనపల్లి శబరిసాయినాద్** ను తమ కోర్టు వ్యవ హారములయందు ఎక్కడ కూడా అతనిని తమ వారసుడి గా ప్రకటించలేదు. ఇతర ప్రైవేటు వ్యవహారములందు కూడా ఎక్కడా అతనిని తమ వారసుడిగా ప్రకటించబడ లేదు. నా కక్షిదారుల కుటుంబసభ్యులైన **బాపనపల్లి శ్రీమన్నారాయణ, వెంకటసుజాత** లకు, వారి గర్భ జనిత సంతానములు లేరు. కాని సదరు **బాపనపల్లి శబరిసాయినాద్** వారిని తన కన్న తల్లిదండ్రులుగా అబద్ధాలు ప్రకటించుకుంటున్నాడు. మరియు **బాపనపల్లి వెంకట సుజాత** గారు తన భర్త మరణించిన **తేది.20-11-2020** నుండి ఆమె అన్నదమ్ముల సంరక్షణలో ఉంటూ, తన చివరి కాలములో తన అనారోగ్యసమస్యలకు, తన అన్నదమ్ముల సంరక్షణ తీసుకున్నదే గాని తమస్వయం ప్రకటిత మవుతున్న సదరు **బాపనపల్లి శబరిసాయినాద్** సంరక్షణ కోరలేదు. సదరు బాపనపల్లి శబరీసాయినాద్ కూడా ఆమెకు చివరి రోజులలో ఆమె అనారోగ్యసమస్యలకు సపర్యలు చేయలేదు. వారిరువురూ బ్రతికి ఉండగా, ఏనాడూ అతనిని తమ దత్తు కుమారునిగా ఆదరించి, హక్కులు కల్పించలేదు. గనుక కేవలము మా కక్షి దారుల యొక్క కుటుంబ ఆస్తులను కాజేయ వలయునని దుర్బుద్ధితో సదరు **బాపనపల్లి శబరి సాయినాద్** సదరు డాక్యుమెంటును సృష్టించుకుని వున్నాడు. అది ఫోర్జరీ డాక్యుమెంటు. కనుక సదరు **శబరిసాయినాథ్** ఏవిధమైన కోర్టు ఉత్తర్వులు పొందకుండా, నాకక్షిదారులయొక్క కుటుంబ ఆస్తులలో జోక్యం చేసుకొనినట్లయితే అతనిపై మేము జరుపు సివిల్,క్రిమినల్ చర్యలకు బాధ్యు డగునని తెలియజేయడమైనది. నాకక్షిదారులకు, వారికుటుంబ ఆస్తులపై సర్వాధికారములు గలవు. అంతేగాని సదరు ఆస్తులపై **బాపనపల్లి శబరీసాయినాద్**కు ఎలాంటి హక్కులు లేవు.

ఇట్లు,
ఆర్.శివకుమార్, బి.కాం, బి.ఎల్.,
న్యాయవాది, కావలి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సెల్ నెంబర్: **9291688129**